క్లుప్తంగా

బీసీలకు న్యాయం చేసిన ఏకైక సీఎం జగన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీసీలకు న్యాయం చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, జనరల్ స్థానాల్లో సైతం బీసీలకు పట్టం కట్టడం ద్వారా బీసీలపై ఉన్న ప్రేమాభిమానాలు చాటుకున్నారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ అంబటి నాగ రాధాకృష్ణ యాదవ్ అన్నారు. ముత్యాలంపాడులోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు బీసీల పట్ల ప్రేమ ఒలకబోస్తున్న టీడీపీ అధినాయకత్వం అధికారంలో ఉండగా ఎంతమది బీసీలను రాజ్యసభకు పంపించారని ప్రశ్నించారు. అలాగే బీసీలలో ఎంతమందికి మంత్రి పదవులు ఇచ్చారో గుర్తు తెచ్చుకోవాలన్నారు. బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఆహార నాణ్యత, మెస్ బిల్లులు, ఉపకార వేతనాలు గతంతో పోల్చుకుంటే ఎంతగా మెరుగ్గా ఉన్నాయో జగమెరిగిన సత్యం అన్నారు. లోకేష్ బీసీల గురించి మాట్లాడే టప్పుడు వారు ఏం చేశారో గుర్తు చేసుకోవాలని హితవు పలికారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):విజయవాడ అర్బన్ పరిధిలోని స్థానిక 58వ డివిజన్‌లోని సింగ్‌నగర్-09 అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టు (ఓసీ)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి టి.నాగమణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై 35 సంవత్సరాలలోపు వయస్సు ఉండి స్థానికురాలైన వివాహిత మహిళా అభ్యర్థులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్హత సర్టిఫికెట్లు, నివాస ధృవపత్రము, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించి, పాస్‌పోర్ట్‌సైజు ఫోటోలను జత పరచి ఆగస్టు 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కానూరులోని ఉమాశంకర్‌నగర్ ఒకటో లైన్‌లో ఉన్న సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం కార్యాలయంలో అందించాలని సూచించారు. ఇతర వివరాలకు 9440814595 ఫోను నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రక్షణ గోడ నిర్మాణ పనులకు ఆటంకం



కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణానది పరివాహక ప్రాంతంలో వరద ముంపు శాశ్వత నివారణకు నిర్మిస్తున్న రక్షణ గోడ ఫేజ్-3 పనులకు ఆటంకం కలిగింది. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజీకి ఎగువన వరద నీరు భారీగా చేరడంతో అన్ని గేట్లను ఎత్తి దిగువకు 2.5 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని జలవనరుల శాఖ అధికారులు దిగువకు విడుదల చేశారు. దీంతో రక్షణ గోడ నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడింది. వరదను ముందుగా అంచనా వేయకపోవడంతో రక్షణ గోడ నిర్మిస్తున్న వీఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి చెందిన రెండు లారీలు, స్టీల్, షట్టరింగ్ సామగ్రి నీట మునిగాయి. దాదాపు రూ.120 కోట్లతో నిర్మిస్తున్న ఈ రక్షణ గోడ నిర్మాణ పనులు 60 శాతం పూర్తయ్యాయి. వరదలు తగ్గిన వెంటనే మరలా నిర్మాణ పనులను ప్రారంభించి వచ్చే వరదల నుంచి ముంపు లేకుండా పూర్తి చేస్తామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

ముస్లింలకు మొహర్రం శుభాకాంక్షలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):మంచితనం, త్యాగానికి ప్రతీకగా మొహర్రం పండుగ నిలుస్తుందని, ప్రజలందరి జీవితాల్లో మొహర్రం పండుగ వెలుగులు నిండాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాలు ఆశాభావం వ్యక్తంచేశారు. శనివారం మొహర్రం పండుగ సందర్భంగా నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో ముస్లింలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం లభించిందని పేర్కొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):తమతో పాటు ఇంట్లో నిద్రిస్తున్న తమ కుమార్తె అదృశ్యమైందని సింగ్‌నగర్‌కు చెందిన ఓ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎక్సెల్‌ప్లాంట్ సమీపంలో నివసిస్తున్న షేక్ హుసేన్‌బీకి ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్దకుమార్తె షేక్ సుల్తానా ఇంటర్మీడియెట్ వరకూ చదువుకొని ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటుంది. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి, నిద్రపోయిన సుల్తానా తెల్లవారేసరికి కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు తమ కుమార్తె ఆచూకీ కోసం స్నేహితులు, బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఎక్కడా కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలతో జనరంజక పాలన

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్):అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 62వ డివిజన్ 271వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి, అధికారులతో కలిసి పటేల్ నగర్లో ఎమ్మెల్యే విష్ణు విస్తృతంగా పర్యటించారు. 212 గడపలను సందర్శించి సంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. పేదలకు మంచి చేయాలన్నదే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నిటిని నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని తెలిపారు. కరోనా క్లిష్ట పరిస్థితుల్లోనూ ఏదో ఒక పథకం రూపంలో ప్రజలను ఈ ప్రభుత్వం ఆదుకుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై ఆరా తీసి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

సాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబు విష ప్రచారం...

సాగునీటి రంగంపై ప్రతిపక్ష నేత చంద్రబాబు విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. ఇక అధికారం దక్కదనే భయంతో బాబు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో సాగునీటి ప్రాజెక్టులను కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. ఇరిగేషన్ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు జీవం పోసింది మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని తెలిపారు. జలయజ్ఞంతో అనేక నూతన సాగునీటి ప్రాజెక్టులకు అంకురార్పణ చేసి, రైతు బతుకు చిత్రాన్ని పూర్తిగా మార్చివేశారన్నారు. కృష్ణా డెల్టాను స్థిరీకరించి ఉమ్మడి కృష్ణా జిల్లా వరప్రదాయని అయినటువంటి పులిచింతలను పూర్తి చేసిన ఘనత ఆ మహానేతకే దక్కుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అన్ని రకాల అనుమతులు తీసుకురావడమే కాకుండా ఆయన హయాంలోనే 75 శాతం భూసేకరణ జరిగిందని గుర్తు చేశారు. చంద్రబాబు మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసి ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేక పోయారని విమర్శించారు. అనంతరం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరి, కోఆప్షన్ సభ్యులు నందెపు జగదీష్, నాయకులు అలంపూరు విజయ్, వీరబాబు, రామిరెడ్డి, మస్తాన్,బోరాబుజ్జి, హైమావతి, గ్రేసీ, సుబాన్, రెడ్డమ్మ, వీరంకి నాగేశ్వరావు, బ్రహ్మేంద్ర, వెంకట్, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్):బూత్ లెవల్ ఏజెంట్లు ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సత్యనారాయణపురంలోని గాయత్రీ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం 1, 23, 24, 25, 26, 27, 28, 29, 31, 33, 36 డివిజన్‌ల బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్‌ఏ) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ దోహదం చేస్తుందని తెలిపారు. తప్పనిసరిగా బీఎల్‌ఏలు తమ వద్ద ఓటర్ల జాబితా కలిగి ఉండాలని పేర్కొన్నారు. జాబితాలో ఎక్కడా తప్పులు లేకుండా చూడాలని తెలిపారు. మార్పులు, చేర్పుల సమయంలో జాగ్రత్త వహించాలని చెప్పారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చేలా చూడాలని పేర్కొన్నారు. నకిలీ, దొంగ ఓట్ల విషయంలో అప్రమత్తంగా ఉంటూ తక్షణమే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. మరణించిన వారు, అద్దె ఇళ్లలో మారిన వారు ఇలా నిజమైన ఓటర్లను గుర్తించి ఎప్పటికప్పుడు బీఎల్‌ఓలకు తెలియపరచాలన్నారు. అలాగే ఫామ్ 6, 7, 8 లపై బీఎల్‌ఏలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శర్వాణీ మూర్తి, బాలి గోవింద్, కొంగితల లక్ష్మీపతి, పెనుమత్స శిరీష, కుక్కల అనిత, బంకా శకుంతల, కొండాయగుంట మల్లీశ్వరి వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇంఛార్జిలు అంగిరేకుల నాగేశ్వరరావు , కనపర్తి కొండలరావు, నగర మహిళా అధ్యక్షురాలు పిల్లి కృష్ణవేణి, కోఆర్డినేటర్లు, బూత్ లెవల్ ఏజంట్లు తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మీయ స్వాగతం



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆత్మీయ స్వాగతం పలికారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జరిగిన ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు సీఎంకు పుష్ప గుచ్ఛం అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు.
– గాంధీనగర్ (విజయవాడసెంట్రల్)

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి



కడియాల వారి వీధిలో మొక్కలు నాటుదుతున్న కార్పొరేటర్ కుక్కల అనిత



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ షాహీనాసుల్తానా

పాయకాపురం(విజయవాడరూరల్): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం చేస్తాయని 61వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి అన్నారు. ప్రపంచ ప్రకృతి పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె శుక్రవారం చికిత్స ఆసుపత్రి లో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ కోఆర్డినేటర్ నాలం బాబు, పార్టీ నాయకులు ఆర్ఎస్ నాయుడు,సుబ్బారెడ్డి, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. 64వ డివిజన్ కండ్రిక లో కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ మొక్కలు నాటారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు):పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. ఆమె శుక్రవారం డివిజన్ పరిధిలోని బోయపాటి వీధి, కడియాల వారి వీధి తదితర ప్రాంతాల్లో నగర పాలక సంస్థ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పెంచి పోషించాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే గ్లోబల్ వార్మింగ్ ముప్పు నుంచి బయటపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, స్థానిక నేతలు కుక్కల రమేష్, శంకర్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో కాలుష్యం నివారణ

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటుగా చేసుకోవాలని 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వీవీ నరసరాజు రోడ్డులో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీపతి ముఖ్య అతిథిగా పాల్గొని వైఎస్సార్ సీపీ నాయకుల, ఉద్యానవన శాఖ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు పెరిగిపోతున్న కాలుష్యంను అదుపు చేయాలంటే మొక్కలు నాటడం తప్పనిసరి అన్నారు. భావి తరాల భవిష్యత్తు కోసం మొక్కలు పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కంభం కొండలరావు, గోవిందు, పిల్లి కృష్ణవేణి, పూర్ణిమ, కొంగితల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు దోహదం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):నానాటికీ పెరుగుతున్న కాలుష్య కోరల్లో నుంచి మనల్ని మనం కాపాడుకునేందుకు చెట్లు అధిక పాత్రను పోషిస్తాయని, సమాజంలో ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచడాన్ని అలవాటుగా మార్చుకోవాలని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా అన్నారు. కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఆదేశాల మేరకు సింగ్‌నగర్‌లో శుక్రవారం మొక్కల పెంపకం కార్యక్రమం జరిగింది. దీనిలో పాల్గొన్న ఆమె ఎంకే బేగ్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. భవిష్యత్ తరాలకు చక్కని వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ చెట్లను తప్పకుండా పెంచాలని సూచించారు. మొక్కలను నాటి వదిలేయకుండా వాటి పెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, ఇమామ్‌బాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజమూరి వందనం బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, కంభగళ్లరాజు, కొండా జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఆర్‌లో ముగిసిన నాక్‌పీర్ టీమ్ పర్యటన



ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మికి రిపోర్టు అందజేస్తున్న సుశీల్‌కుమార్ తోమర్

మధురానగర్(విజయవాడసెంట్రల్):మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్‌పీర్‌టీమ్ పర్యటన శుక్రవారం ముగిసింది. నాక్‌పీర్ టీమ్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ సుశీల్‌కుమార్ తోమర్ నేతృత్వంలో రెండురోజుల పాటు పర్యటించారు. ఈ సందర్భంగా నాక్‌పీర్‌టీమ్ కళాశాల ఐదు సంవత్సరాల పురోగతిని పర్యవేక్షించారు. కళాశాలలోని 25 విభాగాలను అటానమస్ ఎగ్జామ్ సెక్షన్, రీసెర్చ్ విభాగం, డిజిటల్ క్లాస్ రూమ్స్, వ్యాయామ విద్యా విభాగం, ప్లే గ్రౌండ్‌ను, లైబ్రరీ, పీజీ విభాగం, వివిధ ల్యాబ్స్, కంప్యూటర్ విభాగాలు పర్యవేక్షించారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థులు, కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల పురోభివృద్ధి కమిటీ, గవర్నింగ్ బాడీ సభ్యులతో కలసి కళాశాలలో జరుగుతున్న వివిధ అభివృద్ధి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా వ్యాయామ విద్యా విభాగంలో గల క్రీడాకారులను వారి నైపుణ్యాలను చూసి కొనియాడారు. ముగింపు సమావేశంలో కళాశాలలో ఉన్న అన్ని విభాగాల పురోగతిని సమీక్షించారు. సుశీల్‌కుమార్ తోమర్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ వారి సేవలను నిస్వార్థంగా అందించాలని కోరారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మికి నాక్‌పీర్‌టీమ్ రిపోర్టును అందజేశారు. కార్యక్రమంలో నాక్‌పీర్‌టీమ్ సభ్యులు ఓజా, ఆంటోనీ రాజ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్):వేగంగా అభివృద్ధి చెందుతున్న 30వ డివిజన్‌లో గద్దె వెంకట్రామయ్యనగర్ నుంచి గుణదల వరకు 80 అడుగుల రోడ్డు పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ బీ హెచ్‌ఎస్‌వీ జానారెడ్డి సూచించారు. గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీలో పనులను శుక్రవారం నగర పాలకసంస్థ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేసేందుకుగానూ టీడీఆర్ బాండ్లు జారీ తదితర అంశాల కోసం ప్రత్యేకంగా ఏసీపీ మోహన్‌బాబును నియమించటం జరిగిందన్నారు. ఇప్పటికే ఇక్కడ 32 మంది టీడీఆర్ బాండ్లు తీసుకోవటానికి అంగీకరించారని తక్కిన వారిని కూడా గుర్తించి వారితో మట్లాడి పనులు ప్రారంభించాలని తెలిపారు. ఇక్కడ రోడ్డు పూర్తయ్యితే నగరంలో ట్రాఫిక్ సమస్యలు కొంత మేర తగ్గే అవకాశం ఉందన్నారు. ఏసీపీ మోహన్‌బాబు మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరలోనే రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయే వారందరినీ కలిసి వారికి టీడీఆర్ బాండ్లు జారీ చేసి రోడ్డు పనులకు మార్గం సుగమం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీపీఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఇటీవల వర్షాలకు పాడయిన 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్య నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్‌లలో రోడ్లకు మరమ్మతులు చురుగ్గా జరుగుతున్నాయి. స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ బి.జానారెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశాల మేరకు రోడ్డు మరమ్మతులు ప్రారంభించారు. తొలుత ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్డు పనులు పూర్తిచేయటంతో పాటు అతి త్వరలోనే రోడ్డు వేయనున్నట్లు అధికారులు తెలిపారు.

● బ్యారేజీపై సందర్శకుల సందడి





విజయవాడ ప్రకాశం బ్యారేజీపై సందర్శకుల సందడి మొదలైంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. బ్యారేజీ గేట్లు సైతం ఎత్తి నీటిని దిగువకు వదిలారు. దీంతో నీటి ప్రవాహాన్ని తిలకించేందుకు నగరవాసులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తరలివస్తున్నారు. బ్యారేజీపై సెల్ఫీలు దిగుతూ ఆహ్లాదంగా ఉంటున్న చిత్రాలివి.
–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ప్రమాణాలతో ఎస్‌టీపీ ప్లాంట్ల నిర్మాణం

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమీక్ష నిర్వహిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ నగరం అంతటా మురుగునీటి శుద్ధి ప్లాంట్లను (ఎస్‌టీపీ) నిర్మించడానికి నిర్దిష్టమైన ప్రమాణాలు పాటిస్తుందని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (యునిడో), నగర పాలక సంస్థ అధికారులతో కలిసి సర్కిల్ -3 పరిధిలోని రామలింగేశ్వరనగర్ 15, 16 వ డివిజన్‌లోని 20 యం.ఎల్.డి సూయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన బంగ్లాలో పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్‌టీపీల నిర్వహణకు రూ.135 కోట్లు మంజూరు కాగా మురుగునీటి నిర్వహణ క్లిష్టమైన సమస్యను పరిష్కరించడం, స్వచ్ఛమైన ఇంధన పరిష్కారాలను ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్దేశించుకుని పనిచేస్తున్నామని యునిడో ప్రతినిధులకు వివరించారు. ప్రాజెక్ట్ ఫేజ్-1లో నగరవాసులకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించటం, నీటి కాలుష్యాన్ని తగ్గించేందుకు నగరంలోని రామలింగేశ్వర నగర్, అజిత్‌సింగ్‌నగర్, ఆటోనగర్, జక్కంపూడి ప్రాంతాల్లో రూ. 14.9 కోట్లతో నాలుగు ఎస్‌టీపీలు, బయోగ్యాస్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. బయోగ్యాస్ ఎనర్జీ ప్లాంట్లతోపాటు స్వచ్ఛమైన శక్తిని ఉత్పత్తి చేయడానికి సేంద్రీయ వ్యర్థాల నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. దీనివల్ల కార్బన్ ఉద్గారాలను తగ్గిస్తున్నామని పేర్కొన్నారు. ఫేజ్-2 మురుగునీటి శుద్ధిని మరింత మెరుగుపరచటంకు వీఎంసీ రూ. 120 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచామని వెల్లడించారు. కాలుష్య నియంత్రణకై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సూచించిన విధివిధానాలు పటిష్టంగా అమలు చేసే క్రమంలో నగర వ్యాప్తంగా మినీ ఎస్‌టీపీలను ఏర్పాటు చేయనున్నామని స్పష్టం చేశారు. సీనియర్ సాంకేతిక నిపుణులు డాక్టర్ నంద్ పాల్ సింగ్, అర్బన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ స్పెషలిస్ట్, రమణ రావు, నేషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, దీపికా లేలే, వీఎంసీ సీఈ ప్రభాకర్, ఎస్ఈ రామ మోహన్ రావు, ఈఈ వెంకటేశ్వర రెడ్డి, అర్బన్ ఇన్‌ఫ్రా ఇంజినీర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

● చేప చిక్కిందోచ్...







ప్రకాశం బ్యారేజీ వద్ద వరద పోటెత్తడంతో నీటి కొంగలు చేపల వేట మొదలుపెట్టాయి. ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహంలో చేపలు పెద్ద ఎత్తున ఉన్నాయి. చేపల కోసం పొంచి ఉన్న కొంగలు అవి రాగనే అమాంతంగా నోట పట్టుకుంటున్న చిత్రాలివి.
–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ప్రతి ఇంటికీ ఫీవర్ సర్వే నిర్వహించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు):ఇటీవల కురుస్తున్న వర్షాలకు నగరంలో జ్వర రోగ బాధితుల సంఖ్య పెరుగుతుందని, దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ లాంటి వ్యాధులు సోకకుండా ప్రతి ఇంటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి మోతిబాబు వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. మంటాడవారి వాధిలో నివాసం ఉండే ఓ మహిళకు మలేరియా జ్వరం నిర్ధారణ కావడంతో శుక్రవారం ఆయన ఆమె ఇంటిని సందర్శించి అందజేస్తున్న వైద్యం వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మోతిబాబు మాట్లాడుతూ మలేరియా కేసు నమోదు కావడంతో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటి పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలని, సెప్టిక్ ట్యాంకు అవుట్‌లెట్ పైపులకు మెష్ ఏర్పాటు చేసుకోవాలని, నీటి ట్యాంకుల పైన మూతలు ఉంచాలని సూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.శ్రీనివాసరావు తదితరులున్నారు.